సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



పెదబయలులో వడగళ్ల వాన

పెదబయలు మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులు వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. 8లో



ముగిసిన టెన్త్ పరీక్షలు

సాక్షి,పాడేరు: జిల్లాలో 63 కేంద్రాల్లో ప్రారంభమైన టెన్త్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులు హుషారుగా ఇళ్లకు బయలుదేరారు.



ఉత్సాహంగా గొడుగుల పండగ

పెదబయలు మండలం సీకరిలో గొడుగుల పండగను ఉత్సాహంగా నిర్వహించారు. తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. 8లో

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:
ఇఫ్తార్ (అది) 6-14
సహర్ (సోమ) 4-23

రంపచోడవరం:
6-29 4-26

లాభాల గుబాళింపు..!

వసంత రుతువు రాకతో ఏజెన్సీలో ఇప్ప పూల గుబాళింపు మొదలైంది. ఈ పువ్వును ప్రసాదాలు, తినుబండారాల్లో వినియోగిస్తారు. విప్ప కాయలనుంచి నూనె తయారు చేస్తూ గిరి మహిళలు ఉపాధి పొందుతున్నారు. పోషకాలు మెండుగా ఉన్నందున వీటి ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. వీరి జీవన విధానంలో ప్రత్యేకత సంతరించుకున్న ఇప్పచెట్టు పేరిట పండగ కూడా నిర్వహిస్తుంటారు.

- ఇప్ప పూల సీజన్ ప్రారంభం
- తినుబండారాలు, ప్రసాదం తయారీలో వినియోగం
- మెండైన పోషకాల వల్ల మంచి డిమాండ్



ఇప్ప పూలను సేకరిస్తున్న గిరి మహిళ



ఇప్ప పువ్వుతో తయారు చేసిన హల్వా

చింతూరు: ప్రకృతితో మమేకమై ఉన్న ఆదివాసీలు అడవిని నమ్ముకుని జీవిస్తారు. వారి జీవన విధానమంతా అడవి, అందులోని చెట్లపై ఆధారపడి ఉంటుంది. వారు చెట్లను ఆరాధించడంతో పాటు సంస్కృతీ, సంప్రదాయాల్లో భాగంగా పండగలు కూడా నిర్వహిస్తారు. అలాంటి వారి జీవన విధానంలో ఇప్ప చెట్టు ప్రత్యేకత సంతరించుకుందని చెప్పవచ్చు. ఈ చెట్టు పేరు చెబితే ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పసారా అనే పదమే అందరికీ గుర్తుకొస్తుంది. కాగా ఇప్పచెట్టు నుంచి వచ్చే ఫలసాయంతో చాలా లాభాలున్నాయనేది చాలామందికి తెలియని విషయం.

సేకరణ ఇలా..

వసంత రుతువు ప్రారంభంలో ఇప్పచెట్ల నుంచి పూలు వస్తాయి. తెల్లవారుజామున నేలరాలిన పూలు గుబాళిస్తాయి. ఏజన్సీ ప్రాంతంలో ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా తమ ఇళ్ల పరిసరాల్లో ఈ చెట్లను పెంచుతున్నారు. పూలు రాలే సమయంలో ముందుగానే చెట్టు చుట్టూ ఉన్న చెత్తను తొలగించి నేలను శుభ్రం చేస్తారు. ఇప్పపూలు తెలుపు రంగులో ఉండటంతో ఆకులతో నిండిన చెత్తలో రాలితే కనబడవు. శుభ్రం చేసిన నేలపై సువాసన వెదజల్లుతూ రాలిన ఇప్పపూలు వడగళ్ల మాదిరిగా స్వచ్ఛంగా కనిపిస్తాయి. ప్రధానంగా ఏటా మార్చి నుంచి మే వరకు ఇప్పపూలు లభిస్తాయి. నేలరాలిన ఇప్పపూలను జీవాలు తినకుండా తెల్లవారగానే ఇంటిల్లిపాదీ కలసి సేకరించి ఎండబెడతారు. పూలు రాలడం పూర్తికాగానే ఇప్ప చెట్టుకు కాయలు కాస్తాయి. వీటిని కూడా ఎండబెట్టి బద్దగా చేసి ఇప్పనూనె తయారు చేస్తారు. పెద్ద ఇప్పచెట్టు నుంచి 100 కిలోలకు పైబడి పువ్వు లభిస్తుంది.

ప్రయోజనాలెన్నో..

బాగా ఎండబెట్టిన ఇప్పపువ్వును ఆలయాల్లో ప్రసాదంగా వినియోగిస్తుంటారు. ఇప్పపువ్వులో ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. రక్తహీనత నివారణకు ఎంతగానో దోహదపడుతుంది. ప్రస్తుతం ఇప్పపూలతో ఎన్నో రకాల తినుబండారాలను తయారు చేస్తున్నారు. వాటిలో హల్వా, కేక్, జాం, లడ్డూ వంటివి ప్రధానమైనవి.

గిరిజనులకు ప్రత్యేక శిక్షణ

చింతూరుకు చెందిన ఆశా స్వచ్ఛంద సంస్థ విప్ప పూల సేకరణ, ముడిసరకు, స్వీట్ల తయారీపై గిరిజనులకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. వన్‌ధన్ వికాస కేంద్రాల్లో గ్రామ సమాఖ్య సంఘాల సభ్యులు విప్పబద్దతో నూనెను తయారు చేస్తున్నారు. ఇప్పనూనెలో ప్రొటీన్లు అధికంగా ఉండటంతో దీనిని వంటకాలతో పాటు దీపారాధనకు కూడా వినియోగిస్తారు.

సంప్రదాయంగా ఇప్పసారా..

ఆదివాసీ గిరిజనులు సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా పండుగలు, శుభకార్యాల్లో ఇప్పసారాను వినియోగిస్తారు. ఎటువంటి రసాయనాలు ఇతర పదార్థాలు వినియోగించకుండా బెల్లంఊటతో కలిపి ఇప్పసారా తయారు చేస్తారు. శుభకార్యాల సమయంలో తమ ఇళ్లకు వచ్చే బంధువులకు ఇప్పసారా ఇస్తారు. శుభకార్యాలు, దినకార్యాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తమవెంట వారు ఇప్పసారాను తీసుకువెళ్లడం ఆనవాయితీ.



ఎండబెట్టిన ఇప్ప పూలు



ఇప్ప పండగ నిర్వహిస్తున్న గిరి మహిళ

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అన్నిరంగాల్లో ప్రోత్సాహం
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

అరకులోయ రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో14 గ్రామ పంచాయతీల పరిధిలో 1227 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయన్నారు. వీటిలో 425 స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలకు రూ.7కోట్ల 48లక్షల 68 వేలు వైఎస్సార్ ఆసరా జమచేసిందన్నారు. దీనివల్ల 23,533 మంది మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. గత ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలను పసుపు కుంకుమ పేరుతో మోసం చేసిందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, అరకులోయ ఏఎంసీ చైర్మన్ రాజారమేష్‌బోష్, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్‌ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు రమేష్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ శెట్టి కృష్ణారావు, లీగల్ కోఆర్డినేటర్ దాసు, ఏపీఎం అప్పయమ్మ, సీసీలు కామరాజు, సూరిబాబు, సరస్వతి పాల్గొన్నారు.

పసుపు, చింతపండుకు గిట్టుబాటు ధర కరువు



హుకుంపేట సంతలో అమ్మకానికి పసుపు



చింతపండు కొనేవారి కోసం గిరిజనుల నిరీక్షణ

గిరి రైతుల ఆవేదన

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చింతపండు, పసుపునకు గత రెండు వారాల నుంచి గిట్టుబాటు ధర కరువైంది.సీజన్ ఆఖరులో పోటాపోటీగా వ్యాపారం జరిగి, కొనుగోలు ధరలు పెరగాల్సిన పరిస్థితిలో ధరలు తగ్గడంతో గిరిజన రైతులు ఉసూరుమంటున్నారు. శనివారం హుకుంపేట సంతకు భారీగా చింతపండును తీసుకువచ్చిన గిరి రైతులకు ధరలు నిరాశపరిచాయి.ఉదయం 10గంటల వరకు నిరీక్షించిన గిరిజనులు చివరకు కిలో రూ.25ధరకు వ్యాపారులకు అమ్మాల్సి వచ్చింది. ఇదే సంతలో పసుపునకు కూడా గిట్టుబాటు ధర కరువైంది. కిలో రూ.50కు మించి వ్యాపారులు కొనుగోలు చేయలేదు. మైదాన ప్రాంతాల్లోని గిడ్డంగుల్లో పసుపు నిల్వలు పెరగడమే కాకుండా, జాతీయ మార్కెట్‌లో డిమాండ్ కూడా తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

న్యూస్‌రీల్

ఆర్అండ్ఆర్ గ్రామసభ రేపు

కూనవరం: పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్,ఎక్స్అఫీషియో జాయింట్ కలెక్టర్ రాజమంహేంద్రవరం వారి ఆదేశాల మేరకు కూనవరం, టేకులబోరు గ్రామస్తులకు ఈనెల 17వ తేదీన ఆర్అండ్ఆర్ గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె.అనసూయ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ సభ ఏర్పాటుచేసినట్టు ఆమె తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కూనవరం, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు టేకులబోరు గ్రామానికి సంబంధించి గ్రామసభ జరుగుతుందన్నారు. ఈ సమాచారాన్ని సంబంధిత గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులను ఆమె ఆదేశించారు.

కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఆలయ కమిటీ సభ్యులు

అరకులోయ రూరల్: అరకులో కొలువైన వేంకటేశ్వర స్వామి ఉత్సవాల పోస్టర్‌ను శనివారం ఆలయ కమిటీ సభ్యులతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1,2,3 తేదీల్లో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సమర్డి రఘునాథ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పాలరాం, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శులు నర్సింగరావు, అర్జున్, సలహాదారులు రామారావు, జి. బాబూరావు, కమిటీ సభ్యులు, గుప్త, నాయక్, శ్రీను, వైస్ ఎంపీపీ రామన్న, అప్పాలు పాల్గొన్నారు.

డి. భీమవరం గ్రామ సచివాలయం తనిఖీ

- సిబ్బంది గైర్హాజర్
- గుర్తించిన ఎంపీడీవో బాపన్నదొర
- షోకాజ్ నోటీసుల జారీ



డి.భీమవరం సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల : మండలంలోని డి.భీమవరం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో కె.బాపన్నదొర శనివారం తనిఖీ చేశారు.సాయంత్రం 3.58 గంటల సమయంలో సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్,విలేజ్ఎడ్యుకేషన్ అసిస్టెంట్,ముగ్గురు వలంటీర్లు మాత్రమే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మిగిలిన సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేరన్నారు. మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో కూడా ఎటువంటి సమాచారం లేదన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకూ నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. విధులకు గైర్హాజరైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

బిందెల తోరణంతో స్వాగత ద్వారం



దుచ్చరపాలెం వద్ద బిందెలతో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



చీరలతో ఏర్పాటు చేసిన స్వాగత మార్గం

మంచినీటి పథకం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు

గూడెంకొత్తవీధి : మండలంలోని దుచ్చరపాలెంలో శ్రీసత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్షిత మంచినీటి పథకాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రేమామృతధార పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని గ్రామస్తులంతా నిర్ణయించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి అధిక సంఖ్యలో హాజరుకానున్న సాయి భక్తులకు వినూత్నంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా వెదురు కర్రలతో స్వాగత ద్వారాలను ఏర్పాటు చేసి బిందెలతో అలంకరించారు. అంతేకాకుండా కుళాయిలు ఏర్పాటు చేసిన చోట చీరలతో స్వాగత మార్గాలను ఏర్పాటు చేశారు. రక్షిత మంచినీటి పథకాన్ని సాయి భక్తుల ఆధ్వర్యంలో ప్రారంభిస్తామని గ్రామస్తులు తెలిపారు.

గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యం

- 'జగనన్నే మా భవిష్యత్'కు ప్రజలు బ్రహ్మరథం
- గిరిజనులకు అన్యాయం చేసే చర్యలకు ప్రభుత్వం దూరం
- రూ.30 కోట్లకు అమ్ముడుపోయిన గిడ్డి ఈశ్వరి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి విమర్శ



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,చిత్రంలో అరకు ఎంపీ మాధవి,జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, గిరిజనులకు అన్యాయం జరిగే చర్యలకు తమతో పాటు ప్రభుత్వం దూరంగానే ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సీఎం జగనన్న పాలనకు మద్దతుగా ఇటీవల నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. ఈ నేపథ్యంలో హర్షం వ్యక్తం చేస్తూ శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. జగనన్నే మా భవిష్యత్ మెగా పీపుల్స్ సర్వేకు గిరిజన ప్రాంతాల్లో విశేష స్పందన లభించిందన్నారు. రాష్ట్రంలో 47లక్షల మంది ప్రజలు మిస్డ్‌కాల్ ఇచ్చి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతునివ్వడం సంతోషంగా ఉందన్నారు. ఏజెన్సీలోని ఎర్రవరంలో హైడ్రోపవర్ ప్రాజెక్టుపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. విద్యుత్ అవసరాలు అధికంగా ఉన్న నేపథ్యంలో భవిష్యత్తులో హైడ్రోపవర్ ప్రాజెక్టు తెరమీదకు వస్తే గ్రామసభల ఆమోదంతోనే జరుగుతుందన్నారు. గిరిజనులు వద్దంటే ఆ ప్రాజెక్టుకు తాము కూడా వ్యతిరేకమన్నారు.రాష్ట్రంలో బోయ,వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే చర్యలపై గిరిజన ఎమ్మెల్యేలమంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యలను నివేదించామన్నారు. అవసరమైతే దీనిపై మరోసారి ఆయనను కలుస్తామన్నారు. గిరిజనులకు అన్యాయం చేసే చర్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పటికీ చేపట్టదన్నారు. రూ.500 కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాల ఏర్పాటుచేస్తున్నారన్నారు. బాక్సైట్ అనుకూల జీవోలను రద్దు చేసి, గిరిజన ప్రాంతాలకు మేలు చేసిన సీఎంపై విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. చంద్రబాబు పాలనలోనే బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే అప్పటి ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అసెంబ్లీలో ఎందుకు నిలదీయలేదని ఆమె ప్రశ్నించారు. జగన్ సీటు ఇస్తేనే గిరిజనుల ఓట్లతో ఎమ్మెల్యే అయిన గిడ్డి ఈశ్వరి చంద్రబాబు ప్రభుత్వంలో రూ.30 కోట్లకు అమ్ముడుపోయారని మండిపడ్డారు. యువగళంలో నారా లోకేష్ స్వయంగా బోయ,వాల్మీకులకు న్యాయం చేస్తానని, తమ హయాంలోనే వారిని ఎస్టీ జాబితాల్లో చేర్చేందుకు బిల్లు పెట్టామని ప్రకటిస్తున్నారన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే లోకేష్‌ను గిడ్డి ఈశ్వరి,టీడీపీ నేతలు నిలదీయాలన్నారు. పార్టీలకు అతీతంగా జేఏసీ నేతలు ఉద్యమం చేపడితే తాము గిరిజనులుగా మద్దతు ఇస్తామన్నారు. అయితే ఈ ఉద్యమంలో అనేక రాజకీయ కోణాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు హయాంలోనే గిరిజనులకు అన్యాయం జరిగే చర్యలు చేపడితే, ఆ టీడీపీ నేతలను పక్కన కూర్చోబెట్టుకుని ఉద్యమం చేయడం సమంజసం కాదన్నారు.

సీఎం జగన్ హయాంలోనే ప్రగతి: ఎంపీ మాధవి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే అభివృద్ధి జరిగిందని అరకు ఎంపీ మాధవి అన్నారు. ఆమె మాట్లాడుతూ అరకు పార్లమెంట్ పరిధిలోని గిరిజనులంతా అభివృద్ధి చెందుతున్నారన్నారు. విద్యా,వైద్య రంగాలను బలోపేతం చేశారన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు,సెల్ టవర్ల ఏర్పాటులో కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని ఎంపీ పేర్కొన్నారు. గిరిజనుల పక్షపాతిగా పేరొందిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలంతా మరోసారి పట్టం కడతారని,175 సీట్లలో విజయం ఖాయమన్నారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానం పార్లమెంట్‌కు వెళితే తగిన విధంగానే స్పందిస్తానని తెలిపారు. ఇప్పటికే అఖిలపక్ష గిరిజన నేతలతో కలిసి ఢిల్లీలోని కేంద్రమంత్రిని కూడా కలిసి తమ సమస్యలు విన్నవించామన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు,రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఏపీ పెట్రో కెమికల్ కారిడార్ చైర్మన్ చొక్కాకుల లక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో తామంతా పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు,మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. నామినేటెడ్ పదవుల ప్రజా ప్రతినిధులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

కరోనా కలకలం

- ఐదు కేసులు నమోదు
- ఒకరి పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కు తరలింపు



సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కరోనా కేసులు నమోదవుతున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలో పాడేరు,జి.మాడుగుల,పెదబయలు మండలాల పరిధిలో ఐదుగురు గిరిజనులకు కోవిడ్ సోకినట్టు పాడేరు జిల్లా ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో శనివారం కేజీహెచ్‌కు తరలించి వైద్యసేవలందిస్తున్నారు. మిగతా నలుగురు పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కరోనా కేసులు నమోదవుతుండడంతో అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు సూచించారు. సామాజిక దూరం పాటించడంతో పాటు మాస్కులు ధరించాలని, శానిటైజర్ల వినియోగించి, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. జలుబు,దగ్గుతో కూడిన జ్వర లక్షణాలు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదన్నారు.

ఉత్సాహంగా గొడుగుల పండగ

పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


సీకరి గ్రామంలో గొడుగులు ఆడిస్తున్న యువకులు

పెదబయలు: ఇటుకుల పండగలో భాగంగా మండలంలో సీకరిలో శనివారం గొడుగుల పండగను ఉత్సాహంగా నిర్వహించారు. స్వగ్రామం కావడంతో అరకు ఎమ్మెల్యే పాల్గుణ పండగలో పాల్గొన్నారు. గిరిజనుల ఆచార సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహించారు. ఇటుకల పండుగ రెండో రోజు ఈ వేడుకను నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా రెండు వీధుల నుంచి సేకరించిన ఎనిమిది గొడుగులను 60 అడుగుల పొడవు గల వెదురు కర్రలకు ఏర్పాటు చేశారు. వీటికి గ్రామ పొలిమేరలో ఉన్న భద్రంరాయి, పెద్ద తుడుము తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీటిని గ్రామ చావిడిలో యువకులు రంగులు చల్లుకుని ఆడించారు. అయితే ఎంతో పొడువైన గొడుగులు కింద పడకుండా ఆడించారు. మహిళలు థింసా నృత్యం చేశారు. దీంతో ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండుతాయని, సుఖసంతోషాలతో ఉంటామని గ్రామ గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. గొడుగులకు పొలాల్లో పూజలు చేయడంతో వేడుక ముగిసింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు. సర్పంచ్ గుల్లేఇ కృష్ణారావు, ఎంపీటీసీ వంతాల ఆనందరావు, రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ సన్యాసి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సీకరి గ్రామంలో గొడుగుల పండగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. ఈ పండగను వందేళ్ల నుంచి నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. యువకులు పోటీపడి గొడుగులు ఆడించడం ఈ పండగ ప్రత్యేకత అని ఆయన వివరించారు.

సీఎం జగన్‌తోనే మంచి భవిష్యత్తు


గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


దేవారం గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, పార్టీ నేతలు

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

సాక్షి, పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంతోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తు ఉందని, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం మండలంలోని వంట్లమామిడి సచివాలయం పరిధిలో రాజాపురం, కారెబంద, మోదాపల్లి, గుర్రగరువు, పందిదొర్లు గ్రామాల్లో 210 గడపలను సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎంపీ మాధవి, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వివరించారు. టోల్‌ఫ్రీ నెంబర్‌కు మిస్డ్ కాల్‌ను గిరిజనులే ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి మాట్లాడుతూ ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్నే కోరుకుంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ప్రతి గిరిజన గ్రామంలో మౌలిక సదుపాయాలతో పాటు విద్య, వైద్యాన్ని ప్రభుత్వం మెరుగుపరుస్తోందన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసే లక్ష్యంతో ప్రజలు ఉన్నారన్నారు. ప్రభుత్వం గిరిజనుల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరెక్టర్ వి.గోపి, సర్పంచ్‌లు మంగమ్మ, రాంబాబు, రాంబాబు, బసవన్నదొర, చిట్టిబాబు, నీలకంఠం,ఎంపీటీసీలు రామకృష్ణపాత్రుడు, నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, నాయకులు కన్నాపాత్రుడు, శ్యామ్, చిట్టిబాబు, శంకరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దేవీపట్నం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చెప్పారు. మండలంలోని శరభవరం సచివాలయ పరిధిలో దేవారం, శరభవరం , ఎస్. రామన్నపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 500 గడపలను సందర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో గిరిజనుల అభ్యున్నతి జరుగుతోందన్నారు. 20వేలకు పైగా గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు.గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, సర్పంచ్‌లు అమ్మాజీ, కృష్ణబాబు, లక్ష్మణ్, నాయకులు బాబ్జి, మురళీ, సత్యనారాయణ, పెద్దబ్బాయిదొర, రవి, నాగేశ్వరరావు, భాస్కరరావు, వెంకట్రావు ,షేక్ సత్తార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 11న ఆదివాసీలతో సింహగర్జన


అఖిలపక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు లింగయ్యదొర, లకే రాజారావు, ఇతర అఖిలపక్ష నాయకులు

సాక్షి, పాడేరు: జాతీయ స్థాయిలో గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 11వ తేదీన ఐదు రాష్ట్రాల ఆదివాసీలతో సింహగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర, పాడేరు మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, ఇతర అఖిలపక్ష నాయకులు తెలిపారు. శనివారం స్థానిక గిరిజన ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివాసీ సంఘాల నేతలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి భవిష్యత్ పోరాటాలపై సమీక్షించారు. ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రలకు చెందిన ఆదివాసీలతో భద్రాచలంలో ఆదివాసీ సింహగర్జన నిర్వహిస్తున్నామన్నారు. తొందరలోనే ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి తదితరులను కలిసి వినతిపత్రాలు అందజేయాలని తీర్మానించినట్టు తెలిపారు.

పెదబయలులో వడగళ్ల వాన

- ఈదురుగాలుల బీభత్సం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం


పెదబయలులో కురుస్తున్న వర్షం

పెదబయలు/జి.మాడుగుల: పెదబయులు, జి.మాడుగుల మండలాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి సాయంత్రం 4 గంటల నుంచి ఉరుములతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. పెదబయలులో ఈదురుగాలులకు చాలా చోట్ల చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లపై పడ్డాయి. రెండు గంటల పాటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాను సిబ్బంది విద్యుత్ పునరుద్ధించారు. పెదబయలులో ఆస్పత్రి ఎదురుగా ఉన్న మోహన్‌రావు చెందిన దుకాణం పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. వైస్ ఎంపీపీ రాజుబాబుకు చెందిన రేకుల షెడ్డు దెబ్బతింది.

ఇండియాలో రుచులు సూపర్


సీలేరులో టీ తాగుతున్న లండన్ వాసులు మైఖేల్, ఐడల్

సీలేరు: ఇండియాలో రుచులు, సంస్కృతి, అందాలు అద్భుతమని యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన మైఖేల్, ఐడల్ పేర్కొన్నారు. భారత్ పర్యటనను కేరళ నుంచి ఆటో ప్రారంభించిన వారు శనివారం ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు స్థానికులతో మాట్లాడారు. కేరళ రాష్ట్రంలో ప్రదేశాలు, జీవన శైలి ఎంతో బాగుందన్నారు. భారత్‌లో ముఖ్యంగా ఇడ్లీ, దోశ, టీ రుచులు బాగున్నాయన్నారు. అటవీ ప్రాంతంలో గిరిజనులు వినూత్నంగా ఉన్నారని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా మన్యంలో లంబసింగి, అరకు ప్రాంతాలను సందర్శిస్తామని చెప్పారు. వారణాసితో తమ పర్యటన ముగుస్తుందని, అక్కడి నుంచి తమ దేశానికి పయనమవుతామని వారు పేర్కొన్నారు.

కారు ఢీకొని చిన్నారితో సహా ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన చిన్నారి ఫాతీమా

చింతూరు: మండలంలోని కాటుకపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చత్తీస్‌గఢ్‌కు చెందిన ముగ్గురు గాయపడ్డారు. కుంటకు చెందిన బహదూర్‌ఖాన్ కుటుంబంతో కలసి ద్విచక్ర వాహనంపై భద్రాచలం ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వెనుకనుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారి పక్కనేవున్న చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో బహదూర్‌ఖాన్‌తో పాటు భార్య షాను, 5 ఏళ్ల కూతురు ఫాతీమాకు గాయాలయ్యాయి. వారికి సమీపంలోని ఏడుగురాళ్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం తరలించారు. కాగా వీరిని ఢీకొట్టిన కారును సమీపంలోని మద్దిగూడెం రహదారిలో చింతూరు పోలీసులు కనుగొన్నారు. కారును అటవీ ప్రాంతంలో వదిలేసి నిందితులు పరారయ్యారని, కారును స్వాధీనం చేసుకుని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.